వచ్చు అనేది రాజారాం ఆలోచన. సాయంకాల సమయం. సిరవడి గుడిసె దగ్గరికి చేరుకున్నాడు.

''సిరవా!'' అని పిలుపు వినిపించే సరికి, తడిక పక్కకు జరిపి.. బైటికి తొంగి చూసింది లచ్చి.

వర్షంలో తడుస్తూ వచ్చిన దొరను చూసి ఆశ్చర్యపోయింది.

''రండి దొరా! లోనకు రండి'' అంటూ దొరను ఆహ్వానించింది.

వర్షంలో తడుస్తున్న దొర గుడిసెలోకి అడుగు పెడుతూ..

''సిరవడు లేడా ?'' అని అడిగాడు.

''లేడు దొరా! గౌరీపేటకి పోయిండు. గట్లనే మీ ఇంటికి కూడా పోయి వస్తనని.. జుంటి తేనె, చింత పండు, అడవి పండ్లు తీసుకపోయిండు దొరా! అయ్యో.. గట్లనే నిలబడ్డరు. లోనకి రండి దొరా'' అన్నది లచ్చి.

గుడిసెలోకి వెళ్లి చుట్టూ చూశాడు దొర. చిన్న గుడిసె. మధ్యలో తడిక ఉంది. దాని అవతల వంట పొయ్యి ఉన్నది. చాలాసార్లు ఆ ఇంటివైపు వచ్చాడు కానీ, సిరవడి గుడిసెలోకి ఎన్నడూ తొంగి చూడలేదు.

మంచంలో ఆడుకుంటున్న చిన్నబాబును తీసి తడిక లోపలి మంచంలో పడుకోబెట్టింది లచ్చి. మంచం మీది బట్టలు తీసేసి శుభ్రమైన చెద్దరు పరిచింది.

''దొరా!''.. అంటూ తల తుడుచుకోవడానికి తువ్వాలు ఇచ్చింది.

''సిరవడు ఎప్పుడొస్తానన్నడు లచ్చీ'' తల తుడుచుకుంటూ అడిగాడు దొర.

''బెగే ఒత్తానన్నడు దొరా! ఈపాటికి వచ్చేయాల. ఒత్తా ఉంటడు''

దొర ఫోన్ తీసి ట్రై చేశాడు. సిగ్నల్ కలవడం లేదు. లచ్చి గ్లాస్‌తో డికాక్షన్ తెచ్చి ఇచ్చింది.

''దొరా! తడిసి పోయి ఉన్నరు. కాత్త ఏడిగా ఉంటదని డికాసను చాయ్ చేసిన. మాకు పాలు దొరకవు దొరా''

'' పర్వాలేదు లచ్చి! ఇలా ఇవ్వు'' అంటూ గ్లాస్ తీసుకొని తాగాడు దొర.

ప్రయాణ బడలిక, వర్షపు చల్లటి గాలి నుండి ఈ డికాక్షన్ మంచి రిలీఫ్ ఇచ్చింది.

''జగదల్‌పూర్ పోయి వస్తుంటే మధ్యలో వర్షం ప్రారంభమైంది. సిరవడిని తోడు తీసుకుని ఎస్టేట్‌కు వెళదామని వచ్చిన''

''ఒత్తడు దొరా! మీరు కూతంత ఇసరాంతి తీసుకోండి. ఈ వానల ఎట్టా పోతరు. తగ్గినంక పోదురుగాని. ఈలోపు సిరవడు ఒత్తడు''

కానీ, వాన ఏమాత్రం తెరిపి ఇవ్వడం లేదు. కుండపోతగా కురుస్తూనే ఉంది. చీకటి పడింది. కానీ, సిరవడు రాలేదు. ఇంటికి ఫోన్ చేయాలని ట్రై చేస్తున్నాడు దొర. ఫోన్ సిగ్నల్ కలవడం లేదు.

లచ్చికి కూడా ఆత్రుతగా ఉంది. దొర వచ్చి ఉన్నాడు. బయట వర్షం తగ్గడంలేదు. సిరవడు ఇంకా రాలేదు. ఆమెకు ఏం చేయాలో తోచడం లేదు. ఒకవేళ సిరవడు వచ్చినా దొర కొరకు భోజనం ఏర్పాటు చేయాలి కదా.

అందుకని అన్నం వండింది. కోడిగుడ్లు కూర చేసింది. చారు చేసింది.

'దొర మాకు దేవునసొంటోడు. గసొంటి దేవర మా ఇంటికొచ్చిండు. ఆయినెకు ఎసువంటి మర్యాద చేయాల్నో ఏమో!? సిరవడు వస్తే బాగుండును' అనుకున్నది.

కానీ బాగా చీకటి పడటంతో..

'ఈ వానల సిరవడు అచ్చుడు సుత కట్టమే!' అనుకున్నది లచ్చి.

''బాగా రేతిరి అయింది దొరా! ఇంకా వాన తగ్గలేదు. సిరవడు ఎప్పుడొత్తడో ఏమో!? మీరు కూతంత కూడు తిని పడుకోండి. బాగా అలసిపోయి ఉన్నరు'' అన్నది లచ్చి.

దొర ఏమీ మాట్లాడలేదు. ఏం చెప్పాలో ఆయనకు అర్థం కాలేదు. మౌనంగా ఫోన్ ట్రై చేస్తూ ఉన్నాడు. కానీ సిగ్నల్ కలవడం లేదు.

అరుగు మీద కొయ్యకు తగిలించి ఉన్న సొరకాయ బుర్ర గుర్తుకువచ్చింది లచ్చికి.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.